క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం గిడ్డమ్మ

తుగ్గలి : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి హర్షిత్ ఎంపికయ్యారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 విభాగం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా ముదిరెడ్డిపల్లెలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో హర్షిత్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. హెచ్‌ఎం గిడ్డమ్మ, పీడీ, ఎస్‌ఎంసీ చైర్మన్ గుండమ్మ, గ్రామస్తులు విద్యార్థిని శనివారం అభినందించారు.

ప్రత్యేక పూజలు



కూర్మనారాయణ స్వామి

ఆస్పరి: మండలంలో హాలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కందిలో సంరక్షణ చర్యలు చేపట్టండి



కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ రవి

మద్దికెర : మండలంలో నాలుగు రోజులుగా వర్షాలు పడుతున్నాయని, 45 మి.మీ వర్షపాతం నమోదైందని దీంతో కంది పంటను తెగుళ్ల ఆశిస్తున్నాయని రైతులు వెంటనే మందులు పిచికారీ చేసి పంటలను సంరక్షించుకోవాలని ఏఓ రవి తెలిపారు. శనివారం మండలంలో మద్దికెర, ఎం.అగ్రహారం పరిసరాల్లో సాగైన కంది పంటను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ కంది పంట పూత దశలో ఉందని, రసం పీల్చు పురుగు, మారక మచ్చల పురుగు ఆశిస్తున్నాయన్నారు. నివారణకు ప్రొఫెనోఫాస్ ఎకరానికి 400 మి.లీ. పిచికారీ చేయాలన్నారు. వర్షాలకు పూత రాలకుండా ఉండటానికి ఎకరాకు 250 గ్రాములు బోరాన్, ఒక కిలో 13-0-45 లేదా 19-19-19 పిచికారీ చేయాలని వివరించారు. ఏఈఓ భోజరాజు, వీఏఏ జాకీర్ ఉన్నారు.

మైనింగ్ ప్రాంతం పరిశీలన



ఎస్. బోయినపల్లి వద్ద గనిలో వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ కల్యాణి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని ఎస్.బోయినపల్లి గ్రామ శివారులోనున్న మైనింగ్ ప్రదేశాన్ని ట్రైనీ కలెక్టర్ కల్యాణి శనివారం పరిశీలించారు. మైనింగ్ నిర్వహణలో తీసుకుంటున్న జాగ్రత్తలు తదతర వాటికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి మైనింగ్ యాజమాన్యనికి పలు సూచనలు చేశారు.ఏదేని ప్రమాదాలు చోటు చేసుకుంటే తక్షణమే స్పందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. భూగర్భ, గనుల శాఖ డీడీ రవిచంద్ ఉన్నారు.

23న వీరన్న గట్టు చెరువు వేలం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని అటవీశాఖ పరిధిలో ఉన్న వీరగన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి ఈ నెల 23వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఫారెస్టు రెంజ్ అధికారి జి.విజయకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలానికి సంబంధించి గతంలో రెండు సార్లు వేలం నిర్వహించగా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో మరోమారు నిర్వహిస్తున్నామన్నారు. 2014 జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు హక్కుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు కర్నూలు రేంజ్ కార్యాలయంలో 23న ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి : స్తంభాల ఏర్పాటు దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ మహేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భయం..భయంగా

- పెచ్చులూడి పడుతున్న కలపరి ప్రాథమిక పాఠశాల
- 1-5 తరగతులు ఒకే గదిలో
- వర్షాలకు ఒరుస్తున్న భవనం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- నాడు-నేడు కింద నూతన భవనం మంజూరు
- చిన్న చిన్న పనులు మినహా నిర్మాణం పూర్తి



కొత్తగా నిర్మించిన పాఠశాల భవనం



కలపరిలో పెచ్చులూడుతున్న తరగతి గది



శిథిలమైన పాఠశాల భవనం

ఆస్పరి: మండలంలోని యాటకల్లు మజరా గ్రామమైన కలపరి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 55 మంది విద్యార్థులు ఒకే గదిలో కూర్చుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పిల్లలను బడికి పంపించాలన్నా భయమేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. తొంభై దశకంలో నిర్మించిన పాఠశాల పైకప్పు ఎప్పుడు పడిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. పాఠశాలలో 55 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. పాఠ్యాంశాలు బోధించడానికి ఆయనకు ఇబ్బందిగా మారింది. వర్షం వస్తే పై కప్పు వెలుస్తుండటంతో వర్షపు నీరు గదిలో నిల్వ చేరి కూర్చోవడానికి కూడా వీలు కాని పరిస్థితి నెలకొంటుందని విద్యార్థులు వాపోతున్నారు. పరిస్థితిని గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఏడాది నాడు- నేడు కింద నూతన భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరు చేసింది. భవన పనులు దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన చిన్న, చిన్న పనులు త్వరగా ముగించి విద్యార్థులను కొత్త భవనంలోకి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలోనే కొత్త భవనంలోకి మారుస్తాం

కలపరి ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైన మాట వాస్తవమే. వర్షం వస్తే నిల్చోవడానికి వీలుకాని పరిస్థితి. 1-5 తరగతుల్లో 55 మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్ ఉన్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఇక గతేడాది నాడు-నేడు కింద పాఠశాలకు నూతన భవనం మంజూరు కాగా నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. చిన్న చిన్న పనులు పెండింగ్ ఉన్నాయి. పెయింట్ వేసి త్వరలోనే కొత్త భవనంలోకి విద్యార్థులను పంపించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకోగలం. ఏదైనా జరిగితే అందరూ బాధపడాల్సిందే. సాధ్యమైనంత త్వరలో కొత్త భవనంలోకి తరగతులను మారుస్తాం.

– తిరుమలరావు, ఎంఈఓ, ఆస్పరి మండలం

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ పద్మావతి

ఆలూరు: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేలా ఏపీఓ, ఈసీలు, ఎఫ్ఏలు పర్యవేక్షించాలని ఏపీడీ పద్మావతి ఆదేశించారు. స్థానిక సీఎల్‌ఆర్సీ కార్యాలయంలో శనివారం వివిధ మండలాలకు చెందిన ఏపీఓలు, ఈసీలు ,సీఎల్‌ఆర్సీ కోర్సు డైరెక్టర్ తదితరులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలానికి 50 గోకులం షెడ్లు, ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 165 సీసీ రోడ్ల పనులకు రూ.15 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. ఈ పనులను గ్రామపంచాయతీ తీర్మానాల మేరకు జరిగేలా ఏపీఓలు, ఈసీలు చూడాలన్నారు. సీఎల్‌ఆర్సీ కోర్సు డైరెక్టర్ సురేష్ ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి మండలాల ఏపీఓలు శ్రీనివాసులు,జుబేదార్, చక్రవర్తి,ఈసీలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కుందనగుర్తి, బెల్డోణ గ్రామాల్లో శనివారం రూ. 20 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు,ఈఓపీఆర్డీ బాలన్న,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తుగ్గలి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాతనలో శనివారం సీసీరోడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచ్ మనోహరచౌదరి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ హేమసుందర్, నాయకులు కృష్ణమూర్తిచౌదరి, తిరుపాల్‌నాయుడు, మైరాముడు, కాలయ్యాచారి, ఈరన్నస్వామి, వెంకటరాంచౌదరి, శ్రీనివాసులుగౌడ్, సంజీవ పాల్గొన్నారు.

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం సీసీరోడ్ల నిర్మాణానికి సర్పంచులు విజయుడు, మల్లికార్జున, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం భూమి పూజ చేశారు. ఏపీఓ నర్సిరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్యాం కుమార్, ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

కృష్ణగిరి: పెనుమాడ, మన్నెకుంట, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో శనివారం సీసీ రహదారుల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. పీఆర్ ఏఈ జాకీర్‌హుసేన్, సర్పంచ్ మారెమ్మ, ఎంపీటీసీ సుంకులమ్మ, కేఈ నందీష్‌గౌడ్, ఎల్వీ ప్రసాద్, మోహన్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హొళగుంద: మద్దిలింగదహళ్లి గ్రామ బీసీ, ఎస్సీ కాలనీలో శనివారం సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.కార్యక్రమంలో పీఆర్ ఏఈ యమునప్ప, ఏపీఓ భక్తవత్సలం, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అజాగ్రత్త ప్రయాణంతో ప్రమాదం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కె.శ్రీనివాసనాయక్

ఆలూరు: వాహనాలపై వెళ్లేటప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశముందని, కావున అజాగ్రత్త, నిర్లక్ష్యపు డ్రైవింగ్ మానుకోవాలని ఆలూరు సీఐ కె.శ్రీనివాసనాయక్ సూచించారు. శనివారం నియోజకవర్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు, బళ్లారి, గుంతకల్లు పట్టణాలకు బైక్‌లపై వెళ్లే వారికి రోడ్డు నిబంధనల గురించి వివరించారు. వాహనదారులు ప్రయాణ సమయంలో కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటే ప్రమాదాల సంఖ్య తగ్గుతుందన్నారు. వాహనదారులు రెన్యువల్ లైసెన్స్‌లు, బీమా, డ్రైవింగ్ లైసెన్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. టాటా ఏసీలు,అప్పి ఆటోలు,మినీ టిప్పర్ల డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, లేకపోతే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ బాలుర-2 హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఆలూరు ఏఎస్ఐ చంద్రశేఖర్, హెడ్‌కానిస్టేబుళ్లు రంగయ్య, జానీవాకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర : పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటమే గాకుండా డయల్ 100 పై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డుపై వెళ్లేటప్పుడు రహదారి నిబంధనలు పాటిస్తూ క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ సూచించారు. శనివారం స్థానిక విద్యాసాయి డిగ్రీ కళాశాలలో అమరవీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఎంఎస్, ఈ మెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 కాల్ చేయాలని చెప్పారు.ప్రిన్సిపాల్ సునీత, కరస్పాండెట్ మాధవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరుణుడి ఎఫెక్ట్!

- వీడని వాన..
- ఉల్లి రైతు కుదేలు
- నేలకొరుగుతున్న వరి పైరు
- కోత కోసే అవకాశం లేక మొక్కలపైనే పత్తి
- భారీగా నష్టపోయామంటున్న అన్నదాతలు



హొళగుంద వద్ద వర్షానికి కుళ్లిన ఉల్లి



గజ్జహళ్లిలో నేల వాలిన వరి పైరు

హొళగుంద : కురుస్తున్న వర్షాలు రైతులకు నష్టాలను మిగులుస్తున్నాయి. ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన పంటలు దిగుబడులు అందుతున్నాయి. ఇప్పటికే దిగుబడులు వచ్చిన వారు ఉత్పత్తులను ఆరబోసుకున్నారు. వర్షం వస్తుండటంతో తడిసిపోయాయి. ముఖ్యంగా ఉల్లి, పత్తి రైతులు అధికంగా నష్టపోయారు. ఉల్లి రైతులు ఎకరాకు రూ.90 వేల దాకా పెట్టుబడి పెట్టి పంట సాగు చేయగా నేడు దిగుబడి దెబ్బతిని అప్పులపాలయ్యారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షానికి చేతికందిన ఉల్లి పంట పొలాల్లోనే కుళ్లిపోతుండటంతో కన్నీరు పెడుతున్నారు. గడ్డలు రంగుమారడంతో మార్కెట్‌లో కొనేవారు కరువయ్యారు. మరికొన్ని రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతవరణం శాఖ చెబుతుండటంతో వారిలో ఆందోళన తీవ్రమైంది.

భూమిలోనే కుళ్లిన దిగుబడి

పంట గడువు తీరినప్పటికీ వర్షాల కారణంగా కోతలు చేపట్టకపోవడంతో ఉల్లి గడ్డలు వర్షానికి భూమిలోనే కుళ్లి పోతున్నాయి. ఎండు దశకు చేరిన గడ్డలను పీకడానికి రైతులు 10 రోజులు నుంచి ఎదురు చూస్తుండగా వర్షాలు తగ్గుముఖం పట్టడం లేదు. కొందరు ముందుగానే కోతలు కోసి కల్లంలో ఆరబెట్టుకుంటున్నా తడిసి గడ్డలు బూజు పట్టి, మొలకలు వచ్చాయి. రైతులు గడ్డలను ఎండబెట్టడానికి సూర్యుడి కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఎకరాకు వంద క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా పంట దెబ్బతినడం వల్ల 70 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎరువుల, మందులు, కోతలకు భారీగా ఖర్చులు పెట్టామని, అందులో సగం కూడా చేతికందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాకు మార్కెట్‌లో రూ.4,500 పైగా ధర పలుకుతుంది. అయితే కుళ్లి, రంగుమారిన పంటను వ్యాపారులు కొనడం లేదు. అలాగే అధిక వర్షాల వల్ల కంకితో నిండుగా ఉన్న వరి పైరు నేలకొరుగుతోంది. దీంతో గింజలన్నీ నేల పాలువుతున్నాయని రైతులు వాపోతున్నారు. మరి కొద్ది రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే పంట పూర్తిగా దెబ్బతినే అవకాశముందని వాపోతున్నారు. శుక్రవారం రాత్రి వరకు హొళగుందలో 25.2 మి.మీ వర్షం కురిసిందని చెప్పారు.

ముంచిన వర్షాలు



రెండెకరాలు కౌలుకు తీసుకొని ఉల్లి పంట సాగు చేశా. ఎకరాకు రూ.90 వేల వరకు పెట్టుబడి పెట్టా. పంటను కోత కోసి మార్కెట్‌లో అమ్మేందుకు సిద్ధమవుతుండగా వర్షం దెబ్బతీసింది. వర్షానికి గడ్డలు కుళ్లిపోతున్నాయి. వాటిని కల్లంలో ఆరబెట్టేందుకు ఎండకోసం ఎదురు చూస్తుంటే వర్షం వదలడం లేదు. మార్కెట్‌లో క్వింటాల్ గడ్డలు కనిష్టంగా రూ.2,500, గరిష్టం రూ.4,500 వరకు ధర ఉన్నపటికీ కుళ్లిన గడ్డ పేరుతో కొనడం లేదు. మంచి ధర లభించకపోతే పెట్టుబడి నేలపాలైనట్లే.

– బోయ సిద్ధప్ప, హొళగుంద



దేవనకొండ వద్ద ఉల్లిని ఆరబోసిన రైతు

దేవనకొండ: మండల కేంద్రంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి వ్యవసాయ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉల్లి, పత్తి పంటలు అధికంగా దెబ్బతింటున్నాయి. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నందున చేతికొచ్చిన పంటను కోల్పోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలి



కంబాలపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే చిక్కీలను పరిశీలిస్తున్న జడ్జి తంగమణి

కృష్ణగిరి: హాస్టళ్లలో ఉండే విద్యార్థులను వార్డెన్‌లు కంటికి రెప్పలా చూసుకోవాలని డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి ఆదేశించారు. మండలంలోని కంబాలపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ, బీసీ హాస్టళ్లతోపాటు ఎరుకలచెరువు గ్రామంలోని ఎస్సీ హాస్టల్, వెల్దుర్తిలోని బీసీ బాలికల హాస్టల్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే గుడ్లు, చిక్కీలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ హాస్టళ్లలో ఉండే విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు విద్య కూడా అందించాలని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు యోగా, క్రీడల్లో నైపుణ్యం సాధించేలా చూడాలన్నారు. కంబాలపాడు ఎస్సీ హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరాయని వార్డెన్ వెంకటేశ్వర్లు ఆమె దృష్టికి తీసుకవచ్చారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలను అడ్డుకుంటాం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల అటవీ, బంజరు భూముల్లో ప్రభుత్వం తలపెట్టిన యురేనియం తవ్వకాలను ప్రజలతో కలిసి అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పేర్కొన్నారు. శనివారం కప్పట్రాళ్ల గ్రామస్తులతో సీపీఎం నాయకులు సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజల బాగోగులు చూడాలే గానీ కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ప్రయత్నించరాదన్నారు. యురేనియం తవ్వకాల వల్ల కప్పట్రాళ్ల గ్రామ పరిసర ప్రాంతాల్లోని అనేక గ్రామాల ప్రజల ప్రాణాల, ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. యురేనియం ఆక్సిజన్‌లో కలిస్తే తీవ్ర మార్పులు జరిగి వాతావరణం, నీరు కలుషితమై పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి యురేనియం తవ్వకాలు జరపకుండా నిలిపివేయాలన్నారు. నాయకులు రాధాకృష్ణ, నారాయణ, వీరశేఖర్, ప్రజా సంఘాల నాయకులు అశోక్, ఆషా, సూరి, మార్కండేయులు, గ్రామస్తులు కౌలుట్లయ్య, ఎర్ర, చిన్న కౌలుట్లయ్య, రంగడు, గిడ్డయ్య పాల్గొన్నారు.

తగ్గిన పత్తి దిగుబడి

పత్తికొండ(తుగ్గలి) : ఈ ఏడాది పత్తి దిగుబడి బాగా తగ్గిపోయింది. ఇందుకు పంట కోత ప్రయోగాలే నిదర్శనం. వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని కోతిరాళ్లలో రైతు శ్రీనివాసరెడ్డి పత్తి పొలంలో ఏఈవో రియాజ్ పంటకోత ప్రయోగాలు చేపట్టారు. నిర్దేశిత కొలతల్లో పంటకోత ప్రయోగం చేయగా 3.800 కేజీల దిగుబడి లభించిందన్నారు. సాధారణంగా 7నుంచి 8 కేజీల దిగుబడి రావాల్సి ఉందన్నారు. సరైన సమయంలో వర్షాలు లేకపోవడం, అధిక వర్షాలు, తెగుళ్లతో దిగుబడి తగ్గిపోయిందన్నారు. వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై ముగిసిన శిక్షణ



కృష్ణగిరిలో వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తున్న రామస్వామి


పత్తికొండ/తుగ్గలి : పంచాయతీ పాలనపై ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పత్తికొండ, తుగ్గలి ఎంపీడీఓ కార్యాలయాల్లో రెండు రోజులుగా ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పత్తికొండ, తుగ్గలి ఈవోపీఆర్డీలు నరసింహులు, శ్రీహరి మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాలు, పంచాయతీ పాలనపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంచాయతీల్లో తరచూ గ్రామసభలు నిర్వహించుకుంటూ చేసిన అభివృద్ధి పనులను సమీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని చిప్పగిరి ఎంపీడీఓ అల్లబకాష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆలూరు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు అధికారులు అభివృద్ధి పనులపై పాత్ర అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఆలూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి ,ఆలూరు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు జిలానీ, విజయ్‌కుమార్, వెంకటనాయుడు, ఉరుకుందప్ప పాల్గొన్నారు.


చిప్పగిరి: మండలంలోని ఉప సర్పంచులు, వార్డు మెంబర్‌లకు రెండు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణలో పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ,నీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ బిల్లులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బాలన్న,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులదే కీలకపాత్ర అని సూపరింటెండెంట్ రామస్వామి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యుల హక్కులు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ట్రైనర్లు చిన్న లక్ష్మన్న, సుంకన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి



చక్రాళ్లలో రైతులను అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్



ఎస్‌హెచ్ ఎర్రగుడిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

పత్తికొండ(తుగ్గలి) : రీ సర్వే పూర్తయిన భూములకు సంబంధించిన సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రమేష్ తెలిపారు. శనివారం చక్రాళ్ల గ్రామంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతులు దాదాపు వందకు పైగా అర్జీలు అందజేశారు. విచారించి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ చెప్పారు. రీసర్వే డీటీ బాలరాజునాయక్, సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వోలు కృష్ణ, రవి, విలేజ్ సర్వేయర్ నవీన్ పాల్గొన్నారు.

తుగ్గలిలో..

మండలంలోని రాతనలో శనివారం రెవెన్యూ అధికారులు రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ సుధాకర్, వీఆర్వో నాగేంద్ర పాల్గొన్నారు.

చిప్పగిరి:రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో భూముల సమస్యలు పరిష్కరించడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ తెలిపారు.శనివారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భూముల సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీఆర్‌ఓలు రంగన్న,మల్లికార్జున పాల్గొన్నారు.

కృష్ణగిరి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఎక్కడైనా పొరపాట్లు జరిగినట్లు భావిస్తే, తామ నష్టపోయాం అనుకున్న భూ యజమానులు, రైతులు ఫిర్యాదు చేసే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల నుంచి 82 ఫిర్యాదులు వచ్చాయన్నారు. సర్పంచ్ గిరిబాబు, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, అయ్యన్న, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో

మండలంలోని బుక్కాపురం గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ శనివారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, దీని వల్ల వారి బంగారు భవిష్యత్ అంధకారం అవుతుందని ఎస్ఐ జి.అశోక్ అన్నారు. స్థానిక బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనారోగ్యాల గురించి వివరించారు. పాఠశాలల్లో, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయించే సమాచారం తమకు తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివాళి

ఆలూరు: హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామానికి చెందిన బోయ హనుమంతప్ప (85) అనే వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం గ్రామానికి చేరుకుని హనుమంతప్ప మృతదేహంపై పూలమాల ఉంచి నివాళుర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, మండల కో-కన్వీనర్ మల్లికార్జున, చింతకుంట సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు అర్ధగేరి శ్రీనివాసులు, ఎంపీటీసీలు తిమ్మప్ప గోపాల్, రామకృష్ణ, పరుశురాం, దర్గప్ప,లింగప్ప, శేఖన్న తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్నగౌరమ్మ వేడుకలు



హొళగుందలో చిన్న గౌరమ్మకు హారతులు ఇచ్చేందుకు వెళ్తున్న చిన్నారులు

హొళగుంద: మండలంలో శనివారం చిన్న గౌరమ్మ వేడుక ఘనంగా జరిగింది. చిన్నారులు, యువతులు ప్రత్యేక అలంకరణతో కలశాలతో గౌరమ్మలు కొలువు దీరిన ఇళ్లకు వెళ్లి పూజలు చేశారు. గౌరమ్మ విగ్రహాలకు నైవేద్యం సమర్పించి మహామంగళ హారతులిచ్చారు. త్వరలో జరిగే పెద్ద గౌరమ్మ పండుగకు మహిళలు పుట్టింటికి తరలివచ్చి వేడుకలను జరుపుకుంటారు.

చదువుకోని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కృష్ణగిరి: గ్రామాల్లో 15ఏళ్ల పైబడిన చదువుకోని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వయోజనవిద్య ఏపీఓ ప్రతాప్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం విలేజ్ బుక్ కీపర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడల్ట్ ఎడ్యుకేషన్ కింద జిల్లాలోని 9 మండలాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా గుర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 15ఏళ్ల పైబడి..చదువురాని వారిని గుర్తించడంలో బుక్‌కీపర్లు చొరవ తీసుకోవాలన్నారు. జిలాల్లోని 9 మండలాల్లో 33వేల మందికి, మండలంలో 3,500 మందిని గుర్తించి వీరిని అక్షరాస్యులుగా మార్చడానికి చర్యలు తీసుకుంటునట్లు చెప్పారు. సూపరింటెండెంట్ రామస్వామి, వెలుగు ఏపీఎం మహేశ్వరయ్య పాల్గొన్నారు.